క్లుప్తంగా

చిన్నారుల అవస్థలు



సాయినగర్‌లో చిన్నారులను డ్రైనేజీ దాటిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

రంపచోడవరం: రంపచోడవరం సాయిన గర్‌లో ఉన్న అంగన్‌వాడీ సెంటర్‌కు చిన్నారులు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. అంగన్‌వాడీ సెంటర్‌కు వెళ్లేందుకు చిన్నారులు పెద్ద డ్రైనేజీని దాటాల్సి వస్తుంది. ప్రతీ రోజు అంగన్‌వాడీ ఆయా చిన్నారులను జాగ్రత్తగా డ్రైనేజ్ దాటిస్తున్నారు. డ్రైనేజీపై పలక ఏర్పాటుచేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఆత్మీయ సన్మానం

కొయ్యూరు: ఇటీవల బదిలీపై వెళ్లిన డౌనూరు పాఠశాల హెచ్‌ఎం శెట్టి ప్రభుదాస్‌ను బుధవారం ఉపాధ్యాయులు సన్మానించారు. ఆయన సేవలను పలువురు కొనియాడారు. పాఠశాల అభివృద్ధిలో ప్రభుదాస్ కీలకంగా వ్యవహరించారని ప్రస్తుత పాఠశాల హెచ్‌ఎం రవి కుమార్ తెలిపారు. పాఠశాలను ప్రగతి పథంలో ఉంచిన అతని సేవలను మరువ లేమని కొనియాడారు.

రాజీవ్‌గాంధీకి ఘన నివాళి



రాజీవ్‌గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకుడు కొండబాబు తదితరులు

గంగవరం: మండలంలోని మొల్లేరు గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకుడు గొంప కొండబాబు యాదవ్ ఆధ్వర్యంలో రాజీవ్‌గాంధీ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, బడుగు , బలహీన వర్గాల అభ్యున్నతికి దివంగత ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ ఎనలేని కృషి చేశారని కొనియాడారు. రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీటీసీ కాసులమ్మ, సర్పంచ్ శోభారాణి

పెదబయలు: మండలంలోని కిముడుపల్లి పంచాయతీ కొత్తవీధి నుంచి మరడాపల్లి వరకు రోడ్డు పనులకు ఎంపీటీసీ సభ్యురాలు కాసులమ్మ, సర్పంచ్ శోభారాణి బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రూ.1.50 కోట్లతో రోడ్డు నిర్మాణం జరుగుతుందన్నారు. పనులు నాణ్యతగా చేపట్టాలని కోరారు. నాయకులు మత్స్యరాజు తదితరులు పాల్గొన్నారు.

సొలభంలో రైతుల ఆందోళన



సొలభం సచివాలయం వద్ద ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

జి.మాడుగుల: మండలంలో సొలభం సచివాలయం–1లో డిజిటల్ అసిస్టెంట్ మెటనరీ లీవ్‌లో ఉండటం, అగ్రికల్చర్ అసిస్టెంట్ లేకపోవడంతో గిరిజన రైతులు పలు ఇబ్బందులు, సమస్యలు ఎదుర్కొంటున్నారు. సచివాలయం వద్ద బుధవారం గిరిజన రైతులు ఆందోళన కార్యక్రమం చేపట్టారు. వారు మాట్లాడుతూ సచివాలయంలో పరిధిలో గల రైతులకు అన్నదాత సుఖీభవ క్రెడిట్ కాని వారు గ్రీవెన్స్ కోసం సచివాలయం చుట్టూ తిరుగుతున్న ప్రయోజనం ఉండడం లేదని వారు అవేదన వ్యక్తం చేశారు. అన్నదాత సుఖీభవ పథకానికి గడువు సమీపిస్తుండడంతో దరఖాస్తులు చేసుకోవడానికి డిజిటల్ అసిస్టెంట్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌లు సచివాలయానికి లేకపోవడంతో నష్టపోతామన్నారు. అధికారులు స్పందించి సొలభం సచివాలయం–1లో డిజిటల్ అసిస్టెంట్, అగ్రికల్చర్ అసిస్టెంట్‌లను త్వరితగతిన నియమించాలని గిరిజన రైతులు కోరారు.

డిగ్రీలో ప్రవేశాలకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్

చింతపల్లి: ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైనట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.విజయభారతి తెలిపారు. ఈ నెల 25వ తేదీలోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. డిగ్రీ కళాశాలలో అందుబాటులో ఉన్న బీఏ, బీకాం కంప్యూటర్, బీఎస్సీ కంప్యూటర్ సైన్స్, బొటనీ, జువాలజీ, కెమిస్ట్రీ గ్రూపులు అందుబాటులో ఉన్నాయన్నారు. విద్యార్థిని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు.

సమస్యలతో సతమతం

- నిరుపయోగంగా రైతు భరోసా కేంద్రం
- అధ్వానంగా లింగాపుట్టు కాజ్‌వే
- అసంపూర్తిగా పాఠశాల భవనం
- విద్యార్థుల అవస్థలు
- షెడ్డులోనే తరగతుల నిర్వహణ



పెదపాల్లంలో అసంపూర్తిగా పాఠశాల భవనం



పెదపాల్లం గ్రామంలో పాఠశాలకు భవనం లేక ఈ షెడ్డులోని తరగతుల నిర్వహణ



లింగాపుట్టు కాజ్‌వే దుస్థితి

పాడేరు రూరల్: మండలంలోని పలు సమస్యలతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధ్వాన దారులు, అసంపూర్తి పాఠశాల భవనంతో విద్యార్థుల అవస్థలు, అసంపూర్తిగా రైతులు నానా అవస్థలు ఎదుర్కొంటున్నారు. మండలంలో గొందెలి పంచాయతీ పరిధిలో ఉన్న లింగపుట్టు సమీపంలో ఉన్న కాజ్‌వే ప్రమాదకరంగా మారింది, గత కొద్ది రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు కాజ్‌వే కోతకు గురైంది. దీంతో చిన్నపాటి వర్షానికి కాజ్‌వే పైనుంచి వరద నీరు ప్రవహిస్తుండడంతో వాహనచోదకులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.ఒక్కోసారి గెడ్డ ఉధృతంగా ప్రవహిస్తే రాకపోకలకు అంతరాయం కలుగుతుందని చెబుతున్నారు. ప్రస్తుతం సమీపంలో నిర్మిస్తున్న వంతెన పనులు పూర్తికాకపోవడంతో రాయిగెడ్డ, సాకుపుట్టు, కొలంబొ, ఇస్కగరువుల గ్రామస్తులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యపై పలుమార్లు అధికారులకు వినతులిచ్చినా పట్టించకోవడం లేదంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు. మండలంలో గబ్బంగి పంచాయతీ దేవరపల్లి నుంచి గుత్తులపుట్టు వెళ్లే మార్గ మధ్యలో సిడిమెట్ట కాజ్‌వే దెబ్బతిందని, ప్రమాదకరంగా మారిందని స్థానికులు చెబుతున్నారు. దెబ్బతిన్న కల్వర్టు ప్రాంతంలో పెద్ద గొయ్యిన మారడంతో వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారని చెబుతున్నారు. రాత్రిళ్ల ఈ మార్గంలో ప్రయాణించే వాహనచోదకులు గోతులో పడి గాయాలపాలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షం పడి గోతులో నీరు చేరుతుందని, దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

విద్యార్థులకు తప్పని తిప్పలు

మండలంలో అతిమారుమూల ఐనాడ పంచాయతీ పెదపాల్లం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల భవనం అసంపూర్తిగా మారిందని గ్రామస్తులు నూకరాజు, కొండమ్మ, సత్యారావు, రంగరావు తదితరులు చెబుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పాఠశాల భవనం నిర్మాణ పనులు ప్రారంభించారు. కాంట్రాక్టర్ పనులను మధ్యలో నిలిపివేశాడు. దీంతో పాఠశాల భవనం లేకపోవడంతో స్థానికులు తాత్కాలికంగా షెడ్డును ఏర్పాటు చేసుకున్నారు. ఆ షెడ్డులోనే తరగతులు జరుగుతున్నాయి. తమ పిల్లలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వర్షం పడితే నానా అవస్థలు ఎదుర్కొంటున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమస్య పరిష్కరించాలని పలుమార్లు అధికారులకు వినతులిచ్చినా పట్టించుకోవడం లేదంటున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

అధ్వానంగా ఆర్‌బీకే

మండలంలో ఇరాడపల్లి పంచాయతీ కేంద్రంలో ఉన్న రైతు భరోసా కేంద్రం అధ్వానంగా మారింది, ప్రస్తుతం ఈ కేంద్రం వినియోగంలో లేకపోవడంతో పిచ్చిమొక్కలు, తుప్పలు పేరుకుపోయాయని స్థానికులు చెబుతున్నారు. ఈ కేంద్రం ప్రాంగణం దారుణంగా ఉందని, విషసర్పాలు బెడద ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షం పడితే దుర్గంధభరితంగా మారుతుందని చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.



ఇరాడపల్లిలో నిరుపయోగంగా రైతు భరోసా కేంద్రం

నిలిచిన బీఎస్ఎన్ఎల్ సేవలు

- వినియోగదారులకు తప్పని అవస్థలు

కొయ్యూరు: బ్రాడ్‌బ్యాండ్ సేవలు నిలిచిపోవడంతో బీఎస్ఎన్ఎల్ వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రంలో అనేక కార్యాలయాలకు బీఎస్ఎన్ఎల్ బ్రాడ్‌బ్యాండ్ కనెక్షన్లున్నాయి.అయితే తరచూ సేవలకు అంతరాయం కలగడంతో పనులు నిలిచిపోతున్నాయి. దీంతో సేవలకు ఆటంకం కలుగుతుంది. మండల కేంద్రంలో బీఎస్ఎన్ఎల్ బ్రాడ్‌బ్యాండ్ సేవలు బుధవారం పనిచేయలేదు. దీంతో వివిధ కార్యాలయాల్లో పనులు కాలేదు. ఇంటర్నెట్ సేవలు తరచూ స్తంభిస్తుండడంతో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. తరచూ ఈ సమస్య వేధిస్తోందని, అధికారులు స్పందించాలని వినియోగదారులు కోరుతున్నారు.ఈ సమస్యపై బీఎస్ఎన్ఎల్ పాడేరు డీఈ శ్రీనివాస్‌ను సంప్రదిస్తే సాంకేతిక సమస్య కారణంగా పనిచేయలేదని తెలిపారు. పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

డంపింగ్‌యార్డు కోసం స్థల సేకరణకు ఆదేశాలు

రంపచోడవరం: రంపచోడవరం పంచాయతీ పరిధిలోని సేకరించిన చెత్తను వేసేందుకు డంపింగ్ యార్డు కోసం స్థలాన్ని గుర్తించాలని రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం సంబంధిత అధికారులను ఆదేశించారు. పీవో బుధవారం తన కార్యాలయంలో మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా డంపింగ్ యార్డు కోసం స్థలాన్ని గుర్తించి నివేదిక సమర్పించాలని సబ్ కలెక్టర్, తహసీల్దార్‌లను ఆదేశించారు. డంపింగ్ వలన చెత్తను ఒకే చోట వేసేందుకు అవకాశం ఉంటుందన్నారు.

సమస్యలపై వినతులు



జేసీ అభిషేక్ గౌడకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకుడు అప్పలనర్స తదితరులు



జేసీ అభిషేక్‌గౌడకు వినతిపత్రం ఇస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

పాడేరు : ఐటీడీఏ పరిధిలోని అన్ని పీవీటీజీ గ్రామాలకు పీఎం జన్‌మన్ పథకం కింద అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఐటీడీఏలో ఐటీడీఏ ఇన్‌చార్జి పీఓ, జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడకు కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. పాడేరు ఐటీడీఏకు కూతవేటు దూరంలో ఉన్న చింతలవీధి పంచాయతీ ఉబ్బేటిపుట్టు మెట్టవీధిలో నివసిస్తున్న పీవీటీజీలకు తాగునీటి సమస్య అధికంగా ఉందని, గ్రామంలో ఉన్న ఒక్క బోరు పూర్తిగా మరమ్మత్తులకు గురైనట్టు వినతిలో పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో సుమారు 200 మంది ఆదివాసీలు నివసిస్తున్నారన్నారు. తాగునీటి సమస్య కాకుండా గ్రామంలో మౌలిక వసతుల సమస్య తీవ్రంగా ఉందన్నారు. సమస్యలు పరిష్కరించాలని మీకోసం లో నాలుగుసార్లు వినతిపత్రాలు ఇచ్చిన అధికారులు స్పదించలేదన్నారు. తక్షణమే తాగునీటి సమస్య పరిష్కరించి, మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో గ్రామస్తులతో కలిసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. వినతిపత్రం అందించిన వారిలో పార్టీ నాయకుడు సుందర్‌రావు, ఉన్నారు.

గూడెంకొత్తవీధి: ఆర్‌వీ నగర్‌లో సెల్ సౌకర్యం కల్పించాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ రాష్ట్ర పంచాయతీ రాజ్ విభాగ కార్యదర్శి బొబ్బిలి లక్ష్మణ్, పార్టీ రాష్ట్ర ఎస్టీసెల్ ప్రధాన కార్యదర్శి జల్లి సుధాకర్, ఆర్.వీ.నగర్‌వార్డు సభ్యుడు అంజీ బుధవారం ఐటీడీఏ పీవో అబిషేక్ గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. ఆర్.వి.నగర్‌లో అనేక కార్యాలయాలు, పాఠశాలలున్నాయని, ఈ ప్రాంతంలో సెల్ టవర్ లేకపోవడంతో సెల్ సిగ్నల్స్, నెట్ సమస్య వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతునానమని పడుతోన్న ఇబ్బందులను పడుతున్నామని పీవోకు విన్నవించారు. సెల్ టవర్ నిర్మాణం చేయించి సిగ్నల్ సదుపాయం కల్పించాలని వారు కోరారు. దీనిపై పీవో సానుకూలంగా స్పందించినట్టు వారు తెలిపారు.

జేఏసీ నాయకుల ధ్వజం

రాజవొమ్మంగి: జేఏసీ సభ్యుడిపై పోలీసు కేసు నమోదు అక్రమం అని జేఏసీ అధ్యక్ష, కార్యదర్శులు బాలకృష్ణ, రాజు అన్నారు. వారు బుధవారం విలేకరులతో మాట్లాడుతూ రాజవొమ్మంగి పోలీసులు మండలంలోని లాగరాయి గ్రామానికి చెందిన జేఏసీ సభ్యుడు సాగిన చిన్నారావును బుధవారం అక్రమంగా అరెస్టు చేశారని పేర్కొన్నారు. చిన్నారావు ఇంట్లో సారా దొరికినట్లు పోలీసులు తప్పుడు కేసు నమోదు చేశారని, టీడీపీ నాయకుల ప్రోద్బలంతోనే ఈ కేసు నమోదు చేశారని ఆరోపించారు. రాజవొమ్మంగి ఎంపీడీఓ కార్యాలయం వద్ద మంగళవారం జరిగిన ఉపాధి హామీ సామాజిక తనిఖీలో చిన్నారావు అధికారులను ప్రశ్నించినందుకు కక్షపూరితంగా ఈ కేసు పెట్టారని ఆరోపించారు. ఇటువంటి చర్యలను ఖండిస్తున్నామన్నారు.

అధ్వాన రహదారితో తప్పని అవస్థలు

గూడెంకొత్తవీధి: తక్షణమే రహదారి సౌకర్యం ఏర్పాటు చేయాలని రింతాడ పంచాయతీ నేలపాడు గ్రామస్తులు కోరుతున్నారు. రహదారి సౌకర్యం లేకపోవడంతో ఎదుర్కొంటున్న ఇబ్బందులను విన్నవించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో గ్రామంలోని రహదారి కోసం రూ.48 లక్షలను కోటాయించారని, నేటికీ పనులు ప్రారంభించలేదని వారు తెలియజేశారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి గ్రామానికి రహదారి నిర్మించాలని వారు కోరారు.



అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

వర్షాలతో అప్రమత్తం

- అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం



హుకుంపేట: బంగాళఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో గిరిజన ప్రాంతంలో భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని, గిరిజనులు అప్రమత్తంగా ఉండాలని అరుకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం సూచించారు. ఆయన బుధవారం విలేకరుతో మాట్లాడుతు భారీ వర్షాల వల్ల గెడ్డలు, వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయన్నారు. ఎవరూ గెడ్డలు, వాగులు దాటే ప్రయత్నం చేయవద్దన్నారు. భారీ వర్షాల కారణంగా పిడుగులు పడే అవకాశాలున్నాయని రైతులు, ప్రజలు సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని సూచించారు.

కమ్యూనిటీ హెల్త్ సెంటర్ పనుల పరిశీలన



ముంతమామిడిలో మల్టీ పర్పస్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను పరిశీలిస్తున్న జేసీ అభిషేక్ గౌడ

పాడేరు : పీఎం జన్మన్ పథకం కింద మండలంలోని కాడెలి పంచాయతీ ముంతమామిడి గ్రామంలో నిర్మిస్తున్న మల్టీ పర్పస్ కమ్యూనిటి భవనాన్ని ప్రారంభానికి సిద్ధం చేయాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ అధికారులను ఆదేశించారు. బుదవారం ఆయన నిర్మాణంలో ఉన్న భవనాన్ని పరిశీలించారు. భవనంలో పర్నీచర్ సిద్ధం చేయాలన్నారు. ఒకే భవనంలో మల్టీపర్పస్ హాలు, అంగన్‌వాడీ సెంటర్, సబ్ సెంటర్‌లు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ భవనం మోడల్ భవనంగా తీసుకొని జిల్లాలోని మిగిలిన భవనాల నిర్మాణాలు చేపట్టాలన్నారు. ఆయన వెంట టీడబ్ల్యూ డీఈ దుర్గాప్రసాద్, వైద్య సిబ్బంది, గ్రామ సచివాలయ సిబ్బంది, తదితరులున్నారు.

చవితి సందడి ప్రారంభం

సీలేరు: అంగరంగ వైభవంగా ఊరువాడ వినాయకచవితి తొలి పూజలు చేసేందుకు యువకులు పెద్దలు పనులను ముమ్మరం చేశారు.ఈనెల 27 న వినాయక చవితి ఉత్సవాలు మొదలవుతున్న నేపథ్యంలో సీలేరు గ్రామంలో వినాయక చవితి సందడి నెలకొంది. గ్రామాల్లో పలుచోట్ల వినాయక చవితి చేసేందుకు ముహూర్తపు రాటా వేశారు.శివాలయం వీధి పందిళ్ల వేస్తున్నారు. దుర్గా వీధిలో గిరిజన యూత్ ఆధ్వర్యంలో ముహూర్త ప్రార్థన బుధవారం నిర్వహించారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

- విద్యుత్ వైర్లపై కూలిన చెట్టు
- నేలకొరిగిన స్తంభం
- నిలిచిన విద్యుత్ సరఫరా



పోలీస్ స్టేషన్ రోడ్డులో కూలిన విద్యుత్ స్తంభం



విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులు చేస్తున్న సిబ్బంది

సీలేరు: సీలేరు గ్రామంలో విద్యుత్ వైర్లపై చెట్టు కూలి సరఫరా నిలిచిపోయింది. మంగళవారం అర్ధరాత్రి ఈ సంఘటన జరగడంతో ప్రమాదం తప్పింది. మార్కెట్ సెంటర్ నుంచి పోలీస్ స్టేషన్‌కి వెళ్లే రోడ్డులో 11 కెవి విద్యుత్ వైర్లపై అర్ధరాత్రి చెట్టు పడి విద్యుత్ స్తంభం విరిగిపోయింది. దీంతో గ్రామంలో కొన్ని వీధులకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. వర్షం కురుస్తుండడంతో పాటు అర్ధరాత్రి సంఘటన జరగడంతో పనులకు ఆటంకం కలగడంతో బుధవారం ఉదయం జెన్‌కో, ట్రాన్స్‌కో సిబ్బంది కలిసి కూలిన చెట్టు తొలగించి విరిగిపోయిన స్తంభాన్ని మార్చారు. కొత్త స్తంభం ఏర్పాటు చేసి సాయంత్రం నాలుగు గంటలకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. అర్ధరాత్రి నుంచి బుధవారం సాయంత్రం వరకు విద్యుత్ సరఫరా లేక స్థానికులు ఇబ్బందులు పడ్డారు. జెన్‌కో ఏడి చంద్రశేఖర్ ప్రసాద్, జూనియర్ ఇంజనీర్ నాగేశ్వరరావు, ట్రాన్స్‌కో లైన్‌మెన్ రాంబాబు సిబ్బందితో కలిసి విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులు చేయించారు.

ఏరియా ఆస్పత్రి పనుల పరిశీలన

చింతపల్లి: ఏరియా ఆస్పత్రిని డీసీహెచ్ఎస్ డాక్టర్ నీలవేణి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రి ప్రాంగణంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. పనులు త్వరగా పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. నూతన భవనాలు అందుబాటులోకి వస్తే రెండు మండలాలకు చెందిన రోగులు బాధలు తీరుతాయని, స్పెషలిస్టు వైద్యులు అందుబాటులో ఉంటారన్నారు. ఆమె వెంట సీనియర్ వైద్యులు డాక్టర్ ఎల్.టి.అనిల్ తదితరులున్నారు.



నూతన భవనాలను పరిశీలిస్తున్న డీసీహెచ్ఎస్ నీలవేణిదేవి

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

ముంచంగిపుట్టు: మండలంలోని పెదగూడ పంచాయతీ కేంద్రంతో పాటు సారధి గ్రామంలో బుధవారం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా సేంద్రియ, ప్రకృతి వ్యవసాయంపై మండల వ్యవసాయశాఖాధికారి మురళీకృష్ణ ఆధ్వర్యంలో గిరిజన రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పవర్ టిల్లరులు కావాల్సిన రైతులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

సేంద్రియ, ప్రకృతి వ్యవసాయంలో భాగంగా గోమూత్రము, పేడ, వేప ఆకులతో నీమాస్త్రం తయారీని వివరించారు. పురుగు మందులు వాడకం వల్ల పంటలకు నష్టాలు కలుగుతాయన్నారు. సేంద్రియ ఎరువుల వాడడం వల్ల మంచి దిగుబడి వస్తుందని రైతులంతా ఖచ్చితంగా వ్యవసాయశాఖ ద్వారా తెలియజేసే పద్ధతులు పాటిస్తూ వ్యవసాయం చేయాలని ఆయన కోరారు.సర్పంచ్ బాబురావు, ప్రకృతి వ్యవసాయం మండల కో–ఆర్డినేటర్ కె.ఆనంద్, రైతు శాస్త్రవేత వెంకటస్వామి, వ్యవసాయ, ప్రకృతి వ్యవసాయ శాఖాల సిబ్బంది, అధిక సంఖ్యల్లో రైతులు పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో మురళీకృష్ణ

పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి



కొయ్యూరులో మానవహారంలో వైద్యసిబ్బంది, విద్యార్థులు



సీలేరులో గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న వైద్య సిబ్బంది



ఎల్లవరంలో అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

కొయ్యూరు: దోమల నియంత్రణ దినోత్సవం సందర్భంగా పలు ప్రాంతాల్లో వైద్య సిబ్బంది ర్యాలీలు నిర్వహించారు. దోమకాటుతో సోకే వ్యాధులు, నియంత్రణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యులు, అధికారులు మాట్లాడుతూ దోమకాటు వల్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. పరిసరాల పరిశుభ్రతతోనే దోమల నియంత్రణ సాధ్యమన్నారు. ఇందులో భాగంగా కొయ్యూరు మండలంలోని యూ.చీడీపాలెంలో ఆస్పత్రి సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వైద్య సిబ్బంది గ్రామస్తులకు సూచించారు. వైద్య సిబ్బంది ఆనంద్, ఉపాధ్యాయుడు బాలకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

సీలేరు: సీలేరులోని పీహెచ్‌సీ పరిధిలో పలు గ్రామాల్లో ఆశా కార్యకర్తలు మలేరియాపై అవగాహన కల్పించారు. దోమలు పెరగకుండా ఇంటి పరిసరాల పరిశుభ్రత తప్పనిసరిగా పాటించాలని కోరారు. వైద్య సిబ్బంది, గ్రామస్తులతో పరిసరాల పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేపట్టారు.

అడ్డతీగల: మండలంలోని ఎల్లవరం పీహెచ్‌సీ సిబ్బంది, విద్యార్థులు ప్లకార్డులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని దోమలు వృద్ధి చెందే ప్రదేశాలను పూర్తిగా తొలగించాలని వైద్యాధికారి వై.దేవీప్రియాంక అన్నారు. ప్రతి వారం ఫ్రైడే డ్రైడే ను పాటించాలన్నారు.మలేరియా, డెంగ్యూ, చికెన్‌గున్యా, మెదడు వాపు, ఫైలేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా ఉండాలంటే దోమల నివారణ ఒక్కటే మార్గమన్నారు.వైద్యాధికారి ఎస్తేరురాణి, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ కె.లక్ష్మణరావు, మలేరియా టెక్నికల్ సూపర్‌వైజర్ పి.శ్రీనివాసరెడ్డి,ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.